ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 18
జనవరి 2026



# జేఎన్‌టీయూలో.. ప్రమోషన్లు అందని ద్రాక్షేనా..?

## జేఎన్‌టీయూలో ఆచార్యుల ఎదురుచూపులు




సీఏఎస్ ఇంటర్వ్యూలు పూర్తయినా కొలిక్కిరాని ప్రక్రియ

జేఎన్‌టీయూ(జీచీఖ)లో పనిచేస్తున్న ఆచార్యులకు పదోన్నతులు అందని ద్రాక్షగా మారింది. నాలుగేళ్ల క్రితం సుమారు 54మంది అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు పదోన్నతులకు అర్హతలు కలిగి ఉన్నప్పటికీ, వర్సిటీ యాజమాన్యం కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్(సీఏఎస్) కింద ఇంటర్వ్యూలు నిర్వహించడంలో తీవ్ర జాప్యం చేసింది. తాజాగా గత డిసెంబరు 16నుంచి 18వరకు ఇంటర్వ్యూల ప్రక్రియను ముగించిన ఉన్నతాధికారులు, నెలరోజులు అవుతున్నప్పటికీ ప్రమోషన్ల ప్రక్రియను పూర్తి చేయడంలో విఫలమయ్యారు. కనీసం ఈ నెలలో అయినా ప్రమోషన్ లెటర్లు అందుతాయో, లేదోనని సందేహం వ్యక్తం చేస్తున్నారు.

### ఉన్నతాధికారుల మోకాలడ్డు ?

కిందిస్థాయి ఉద్యోగులు, ఆచార్యుల సంక్షేమాన్ని కాంక్షించాల్సిన ఉన్నతాధికారులే వారికి ప్రమోషన్లు రాకుండా అడ్డుకుంటున్నారా అంటే.. కొంతమంది ఆచార్యులు, ఉద్యోగుల నుంచి అవుననే జవాబే వస్తోంది. కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ కింద ఇంటర్వ్యూలకు హాజరైన వారి వివరాలతో ఫైల్ ను పాలకమండలి ముందుంచితే ఎప్పుడో క్లియరెన్స్ వచ్చేదని వారంటున్నారు. కొంద రు ఉన్నతాధికారులు అలా చేయకుండా, అర్హతలు లేనివారికి కూడా పదోన్నతులు, సర్వీసు పొడిగింపు ప్రయోజనాలు కల్పించేందుకు ప్రయత్నించడంతో పాలకమండలిలో సభ్యులైన ఒకరిద్దరు ఐఏఎస్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఏఎస్ ఇంటర్వ్యూలకు హాజరైన వారికి పదోన్నతులు కల్పించేందుకు పాలకమండలికి ఎటువంటి ఆభ్యంతరాలు లేకున్నా, 2016లోనే ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందిన ఆచార్యుల్లో కొందరు తమ సర్వీసును ముందుకు జరిపి 2013 నుంచి కొనసాగించాలని కోరడాన్ని ఆక్షేపిస్తున్నట్లు తెలుస్తోంది.

### అలా చేస్తే యూనివర్సిటీకి రూ.150కోట్లు నష్టమని..

అర్హతలేని వారికి పదోన్నతులు కల్పిస్తే యూనివర్సిటీపైరూ.150కోట్లకు పైగా భారం పడుతుందని ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సర్వీసు పొడిగింపు అనేది ఆర్థిక పరమైన అంశం కాబట్టి పాలకమండలి సభ్యులు ఆ ఫైలును పక్కన పెట్టాలని ఉన్నతాధికారులకు సూచించినట్లు సమాచారం. అలాగని అభ్యంతరాలు లేని సీఏఎస్ పదోన్నతులను కూడా నిలిపేయడం ఎంతవరకు సమంజసమని ఆశావహులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పదోన్నతులు, సీనియారిటీ పొడిగింపు అంశాలను వేర్వేరుగా చూడాలని, అన్ని అర్హతలున్న వారికి వెంటనే ప్రమోషన్ లెటర్లు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని ఆచార్యులు కోరుతున్నారు. ఈ నెల 19న పాలకమండలి మరోమారు సమావేశమై పదోన్నతుల్లో నెలకొన్న ప్రతిష్టంభనకు తెరదించే అవకాశం ఉందని ఉద్యోగ, విద్యార్థి సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు.



# అటు పరీక్షలు.. ఇటు ఎన్నికలు..

**సంక్రాంతి తర్వాత ఇంటర్ ఇంటర్నల్స్**

**ఫిబ్రవరి 2 నుంచి ప్రాక్టికల్స్**

**పరీక్షల నిర్వహణపై ప్రభావం**


**విధుల నుంచి మినహాయింపు కోరిన ఇంటర్‌బోర్డు**

ఇంటర్ పరీక్షలపై మున్సిపల్ ఎన్నికల ప్రభావం పడనున్నది. ఇంటర్నల్స్, ప్రాక్టికల్స్ పరీక్షలపై పడే అవకాశం కనిపిస్తున్నది. సంక్రాంతి పండుగ తర్వాత మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. అధికారిక సమాచారం ప్రకారం ఫిబ్రవరిలో పోలింగ్ ఉండే అవకాశం ఉన్నది. సక్రాంతి సెలవులు ముగియగానే ఇంటర్‌లో పరీక్షల సీజన్ ప్రారంభమవుతుంది. ఈ నెలలోనే ఇంటర్ విద్యార్థులకు ఇంటర్నల్ పరీక్షలు ఉన్నాయి. ఈ నెల 21, 22 తేదీల్లో ఇంగ్లిష్ ప్రాక్టికల్స్ జరుగనున్నాయి. 23న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్, 24న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలు జరుగబోతున్నాయి. ఇవి ముగిసిన తర్వాత ఫిబ్రవరి 2 నుంచి 21 వరకు ప్రాక్టికల్ పరీక్షలు రానున్నాయి. ఆ తర్వాత ఫిబ్రవరి 25 నుంచి 18 వరకు ఇంటర్ వార్షిక(థియరీ) పరీక్షలు ఉన్నాయి. పరీక్షల సమయంలోనే ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభమవుతుంది. నెల రోజులపాటు మూల్యాంకనం జరుగుతుంది. ఇటు పరీక్షలు.. అటు ఎన్నికలు ఉండటంతో ఇంటర్‌బోర్డు అధికారుల్లో కలవరం మొదలైంది.

### ఎన్నికల విధుల నుంచి తప్పించండి


ఇంటర్ పరీక్షల విధుల్లో ఉన్న సిబ్బంది, లెక్చరర్లకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఇంటర్‌బోర్డు కోరింది. మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ బాధ్యతలను వారికి అప్పగించొద్దని బోర్డు విజ్ఞప్తిచేసింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, ప్రభుత్వ సెక్టార్(గురుకులాలు) కాలేజీల లెక్చరర్లు, సిబ్బందికి ఎన్నికల డ్యూటీ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఇటీవలే ఇంటర్‌బోర్డు రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. ప్రభుత్వ కాలేజీల్లో పనిచేస్తున్న 1,844 మంది బోధనేతర, 7,110 మంది బోధన సిబ్బంది, ప్రభుత్వ సెక్టార్ కాలేజీల్లో 759 మంది బోధనేతర, 12,131 మంది బోధన సిబ్బంది చొప్పున మొత్తంగా 21,844 మంది పరీక్షల విధుల్లో ఉంటారని పేర్కొన్నది. పరీక్షల సమయంలో సమన్వయం, పర్యవేక్షణ, పరీక్షల నిర్వహణ వంటి విధుల్లో లెక్చరర్లు, సిబ్బంది నిమగ్నమై ఉంటారని, వీరిని ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని విజ్ఞప్తిచేసింది.

# జేఈఈ అడ్వాన్స్‌డ్.. ఇక ఈజీ!



ఐఐటీలలో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ- అడ్వాన్స్‌డ్ పరీక్ష విషయంలో విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ఐఐటీ కౌన్సిల్ కీలక సిఫారసులు చేసింది. అభ్యర్థుల సామర్థ్యం ఆధారంగా పరీక్షలో మార్పులు చేయాలని సూచించింది. దీని ప్రకారం.. ప్రశ్నలను డైనమిక్‌గా రూపొందించడంతోపాటు నిర్ణీత సమయంలో జవాబు రాసేలా ప్రశ్న పత్రాలను రూపొందిస్తారు. విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ఈ ఏడాది నిర్వహించనున్న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు ముందు ప్రయోగాత్మక ఐచ్ఛిక పరీక్షను నిర్వహించాలని కౌన్సిల్‌లోని నిపుణుల బృందం సిఫారసు చేసింది. ఈ ఫలితాల ఆధారంగా భవిష్యత్తు పరీక్షలకు ఏ విధమైన రోడ్‌మ్యాఅబశ్రీశ్రీపను రూపొందించవచ్చునేది స్పష్టమవుతుందని పేర్కొంది. అదేవిధంగా ఐఐటీలలో మానసిక ఆరోగ్య నిపుణులను నియమించేందుకు మంజూరు చేసిన పోస్టులను భర్తీ చేయాలని సూచించింది. ఇదిలా ఉండగా, ఐఐటీలలో అందిస్తున్న ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సుల పాఠ్యాంశాలను సమూలంగా మార్చాలని ఐఐటీ కౌన్సిల్ నిర్ణయించింది.

# ఈ ఫుడ్ తీసుకుంటే.. మీ కంటి చూపు మెరుగుపడటం గ్యారంటీ.!



కళ్లు మనిషికి దేవుడిచ్చిన ప్రత్యేక వరం. అందుకే 'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం' అని అంటారు. కాబట్టి వాటిని జాగ్రత్తగా చూసుకోవడం మన బాధ్యత. ఇటీవల వయసుతో సంబంధం లేకుండా చాలా మంది కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. దీనికి కంప్యూటర్లు, మొబైల్ ఫోన్ల వాడకం, పోషకాహార లోపం వంటివి ప్రధాన కారణాలు. కంటి చూపును మెరుగుపరుచుకోవడానికి, కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి తీసుకోవాల్సిన ఆహార పదార్థాల గురించి తెలుసుకుందాం.

### 1. ఆకుకూరలు:

పాలకూర, తోటకూర వంటి ఆకుకూరల్లో ల్యూటిన్, జియాక్సంతిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కంటి పొరలు దెబ్బతినకుండా కాపాడతాయి.

### 2. క్యారెట్, చిలగడదుంపలు:

వీటిలో విటమిన్లు, పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యకరమైన దుంపలు కంటి చూపు, రోగనిరోధక శక్తిని పెంచుతాయి. రేచీకటి రాకుండా రక్షిస్తాయి.

### 3. సిట్రస్ ఫలాలు:

నిమ్మ, బత్తాయి, నారింజ, ఉసిరి వంటి పండ్లలో విటమిన్-సి అధికంగా ఉంటుంది. ఇది కంటిలోని రక్తనాళాల ఆరోగ్యాన్ని కాపాడుతూ.. శుక్లాలు(జుఞ్ఝతీఞ్ఝవ్ఞిం) వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

### 4. బాదాం, వాల్‌నట్స్:

బాదాం, వాల్‌నట్స్‌లో విటమిన్-ఇ, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి వయసుతో పాటు వచ్చే కంటి చూపు లోపాలను అరికడతాయి. ప్రతిరోజూ 4-5 నానబెట్టిన బాదం పప్పులు తింటే చాలా మంచింది.

### 5. చేపలు:

చేపలలో ట్యూనా, సాల్మన్‌లలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి కళ్లు పొడిబారడం వంటి సమస్యలను పూర్తిగా తగ్గించి, కంటి నాడిని బలంగా ఉంచుతాయి.

### 6. గుడ్లు:

గుడ్డులోని పచ్చసొనలో ల్యూటిన్, జియాక్సంతిన్, జింక్ అధికంగా ఉంటాయి. ఇవి కంటి రెటినాను నీలి కాంతి ప్రభావం నుంచి రక్షించడంలో సాయపడతాయి.

### 7.బెర్రీలు:

బ్లూబెర్రీస్, స్ట్రాబెర్రీస్ వంటి పండ్లలో ఉండే ఆంతోసైనిన్ అనే యాంటీఆక్సిడెంట్లు కంటి రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. కళ్లు త్వరగా అలసిపోకుండా చూస్తాయి.

### 8. విత్తనాలు:

గుమ్మడి, అవిసె, సబ్జా గింజలలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్-ఇ పుష్కలంగా ఉంటాయి. ఇవి కంటి చూపును దీర్ఘకాలం పాటు ఆరోగ్యంగా ఉంచుతాయి.

